

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం

02 డిసెంబర్ 2025 పేజీలు : 08


### చిన్నబజార్ పోలీస్‌స్టేషన్‌ను

## ఆకస్మిక తనిఖీ చేపట్టిన ఐజీ

**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :**

నగరంలోని చిన్న బజార్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌ని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి, జిల్లా ఎస్పీ అజితా వేజండ్లతో పాటు కలిసి సోమవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ మ్యాప్‌ను పరిశీలిస్తూ.. స్టేషన్ పరిధిలో ఉన్న పరిస్థితులు నేర ప్రాంతాలపై అరా తీసి స్టేషన్ రికార్డులను పరిశీలించారు. అనంతరం స్టేషన్ సిబ్బందికి పలు సూచనలు చేస్తూ.. ఫిర్యాదుదారులతో గౌరవప్రదంగా నడుచుకోవాలని, పోలీస్‌స్టేషన్ -మిగతా 2లో



### తుఫాన్ సైతం లెక్కచేయకుండా..

## ఫించన్ పంపిణీ చేసిన మంత్రి నారాయణ



- 11వ డివిజన్లోని ఎన్టీఆర్ నగర్లో ఇంటింటికి వెళ్లి పెన్షన్ అందజేసిన మంత్రి
- మేము ఓటు కోసం రాలేదు.. ఇచ్చిన మాట కోసం వచ్చామని మంత్రి స్పష్టం
- ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా.. అపార అనుభవంతో ఇచ్చిన హామీలన్నీ అమలు
- మేనిఫెస్టోలో చెప్పినవన్నీ 100 శాతం అమలు చేసి తీరుతాం మంత్రి నారాయణ

**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :**

రాష్ట్రంలో ఒకేరోజులో 90 శాతం పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఘనత ఒక్క కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు నగరంలోని 11 డివిజన్లో తుఫాను సైతం లెక్కచేయకుండా సోమవారం ఉదయాన్నే పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి నారాయణ చేపట్టారు. జోరు వానలో సైతం కూడా ఇంటింటికి వెళ్లి పెన్షన్ అందజేస్తున్న నారాయణను లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పెన్షన్‌దారుల బాగోగులను మంత్రి నారాయణ అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. ప్రతినెల 1వ తేదీ రాష్ట్ర పండుగలాగా పెన్షన్ పంపిణీ జరుగుతుందన్నారు. ఉదయాన్నే 6 గంటల -మిగతా 6లో

### స్మారక చిహ్నాల సంరక్షణకు

## ఖర్చు చేస్తున్న నిధులెన్ని ?

**లోకసభలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్న**



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

దేశవ్యాప్తంగా ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ నుండి రాష్ట్రాల వారీగా జాతీయ ప్రాముఖ్యత కలిగిన స్మారక చిహ్నాలుగా గుర్తించబడిన స్మారక చిహ్నాలు ఎన్ని ? అని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం నుంచి ప్రారంభమైన పార్లమెంటు సమావేశాల నేపథ్యంలో స్మారక చిహ్నాల అంశంపై ఆయన లోక్‌సభలో పలు ప్రశ్నలు వేశారు. ప్రభుత్వం ప్రస్తుత జాబితాను హేతుబద్ధీకరించాలని భావిస్తోందా.. అని ఆరా తీశారు. గత ఐదు సంవత్సరాలలో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ ప్రాముఖ్యత కలిగిన స్మారక చిహ్నాల నిర్వహణ, పునరుద్ధరణ కోసం వినియోగించిన నిధుల వివరాలు కోరారు. జాతీయ ప్రాముఖ్యత కలిగిన స్మారక చిహ్నాల నిర్వహణ/పునరుద్ధరణకు ప్రైవేట్ సంస్థలను స్పాన్సర్ చేయడానికి ప్రభుత్వం ఏవైనా చర్యలు తీసుకుందా ప్రశ్నించారు. అలాగే స్మారక చిహ్నాల వద్ద సందర్శకుల రద్దీని పెంచడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించాలని కోరారు.

ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలకు కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. దేశవ్యాప్తంగా 3685 పురాతన స్మారక చిహ్నాలు, పురావస్తు ప్రదేశాలు, జాతీయ ప్రాముఖ్యత కలిగిన అవశేషాలను భారత పురావస్తు సర్వే గుర్తించి -మిగతా 2లో

### ఆర్థిక ఇబ్బందులు ఉన్నా..

## ఆదుకుంటూనే ఉన్నాం

**సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి**

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :**




రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఒకవైపు అభివృద్ధి చేస్తూ మరోవైపు సంక్షేమ పథకాలు కొనసాగిస్తూ అర్హులైన వారికి పింఛన్లు ఇస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికి ఉందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే సోమిరెడ్డి వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మండలంలోని కప్పల దొరువు, మల్లూరు గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు నగదును లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమం గురించి ఎమ్మెల్యే సోమిరెడ్డి మీడియాతో మాట్లాడారు. సర్వేపల్లి నియోజకవర్గంలో -మిగతా 2లో

### కూటమి ప్రభుత్వంలో.. నెల్లూరు నగరం

## మాదక ద్రవ్యాలకు నిలయం

**ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి**



**నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రశాంత జిల్లాగా ఉన్న నెల్లూరు మాదక ద్రవ్యాలకు నిలయంగా మారిందని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆరోపించారు. సోమవారం స్థానిక నెల్లూరు రాంజీనగర్‌లోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర నియోజకవర్గ కార్యాలయంలో పాత్రికేయ సమావేశం నిర్వహించి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గంజాయి వల్ల పాడై పోతున్న యువత గురించి ఘాటుగా విరుచుకుపడ్డారు. గతంలో నెల్లూరు నగరం మంచి నగరంగా.. నిజాయితీకి మంచి మనుషులకి ప్రతీకగా ఉండేదన్నారు. నేడు నెల్లూరు నగరంలో అవన్నీ కనుమరుగయ్యాయన్నారు. ప్రస్తుతం నెల్లూరు నగరం అంటే మాదకద్రవ్యాలకు, నేరాలకు నిలయంగా మారిపోయిందన్నారు. నెల్లూరు నగరంలో ఇలాంటి -మిగతా 2లో

# కూటమి ప్రభుత్వంలో.. నెల్లూరు నగరం మాదక ద్రవ్యాలకు నిలయం

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితులను ఎవ్వరు ఊహించి ఉండరన్నారు. లా అండ్ ఆర్డర్ అదుపుతప్పి నేరాలు విచ్చలవిడిగా చోటు చేసుకుంటున్నాయన్నారు. సమాజంలో శాంతిభద్రతలు క్షీణించి, యువత పెడద్రోవ పడుతుండడం ప్రజలందరూ చూస్తున్నారన్నారు. పోలీసు ఇంటిలిజెన్స్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమై నెల్లూరు నేరాలకు క్యాపిటల్‌గా మారిందన్నారు. నెల్లూరు నగరంలో విచ్చలవిడిగా దొరుకుతున్న.. గంజాయే దీనికి ప్రధాన కారణమన్నారు. గతంలో గంజాయి అనేది ఎక్కడో మారుమూల ప్రాంతంలో.. ఎవరో గంజాయి కొడుతున్నారని విని ఉంటామని, నేడు అది విచ్చలవిడి అయిపోయిందన్నారు. 2024లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత.. నెల్లూరు నగరం విచ్చలవిడి గంజాయికి అడ్డాగా మారిందన్నారు. గంజాయికి బానిసై.. ఇళ్ళ మీదకు వెళ్లి దాడులు చేయడం, 200కు 300 రూపాయలకు హత్యలు చేస్తూ.. పీకలు కోస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇలాంటి ఘటనలు నిత్యకృత్యమయ్యాయన్నారు. దీనికి కారణం కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత.. 24 గంటలు మద్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి, విచ్చలవిడిగా మద్యాన్ని విక్రయించడం, విపరీతంగా గంజాయి, చీప్ లిక్కర్ దొరుకుతుండడం.. వీటన్నింటి వల్ల నెల్లూరు నగరం నేరాలకు అడ్డాగా మారిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఒరిస్సా నుంచి దిగుమతి అయిన లక్ష కేజీల గంజాయి.. అంటే సుమారు 400 కోట్ల రూపాయల గంజాయిని తగలబెట్టించడం జరిగిందన్నారు. నేడు గంజాయి విపరీతంగా దొరుకుతున్నా.. కూటమి ప్రభుత్వం కట్టడి చేయడంలో విఫలమైందన్నారు. దీనికి ప్రధాన కారణం కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక.. జైలులో ఖైదీలకు ఇంటర్ జోనల్ సిస్టం తీసుకువచ్చి, వైజాగ్, రాజమండ్రి జైళ్లలో ఉన్న ఖైదీలను నెల్లూరు జైళ్లకు తీసుకురావడంతో.. వారు నెల్లూరు జైల్లో ఉంటున్న ఖైదీలను వాడుకొని, వారి ద్వారా నెల్లూరులో గంజాయి విక్రయాలు సాగిస్తున్నారన్నారు. ఇన్ని జరుగుతున్నా.. పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా మారి, నేరస్తులకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీ సభ్యులపై అక్రమ కేసులు బనాయిస్తూ.. కూటమి




నేతలు చెప్పిందే వేదంగా పని చేస్తున్నారన్నారు. జిల్లాలో ఇంటిలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఉన్నప్పటికీ.. ఇలాంటి ఘటనలు కట్టడి చేయడానికి వాళ్ళు ఏం చర్యలు తీసుకుంటున్నారో ప్రజలకు అర్థం కావడం లేదన్నారు. పెద్ద మొత్తంలో ఒరిస్సా నుంచి గంజాయి ఏపీకి తరలి వస్తుందని, అక్కడి నుంచి ద్విచక్ర వాహనాల్లో గంజాయిను నెల్లూరుకు తీసుకు వస్తున్నా.. పోలీస్ నిఘా విభాగం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఇలా నెల్లూరుకి తీసుకొచ్చిన గంజాయిని మెడికల్, ఇంజనీరింగ్ విద్యార్థులకు అలవాటు చేయించి, వారి ద్వారా ఎక్కువ మంది విద్యార్థులు దీనికి బానిస అయ్యేలా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లూరు నగరంలో 300 మందిని డెలివరీ బాయ్స్‌గా వాడుకొని.. వారి ద్వారా గంజాయిని విపరీతంగా యువతకు చేరవేస్తూ.. వారు గంజాయికి బానిసయ్యాలా చేస్తున్నారన్నారు. 5 గ్రాముల గంజాయిని.. చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చి, ఒక్కో ప్యాకెట్ను 300 రూపాయలకు విక్రయిస్తూ.. గంజాయిని చాపకింద నీరులా యువతకు అలవాటు చేస్తున్నారన్నారు. ఇలా గంజాయి తీసుకుంటున్నవారు.. చీప్ లిక్కర్, గంజాయి.. రెండింటికీ అలవాటు పడి విపరీతమైన మత్తులో జోగుతూ, విచక్షణారహితంగా హత్యలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విధమైన పరిణామాల మూలంగానే ప్రజానాట్య మండలి నేత పెంచలయ్య హత్య జరిగిందన్నారు. నెల్లూరులో ఈ విధమైన దుర్మార్గమైన సంస్కృతి మారాలని, పోలీసు వ్యవస్థ నగర శివారులో గస్తీ ముమ్మరం చేసి గంజాయి విక్రయాలు సాగిస్తున్న వారిపై ఉక్కుపాదం మోపాలన్నారు. అధికార పార్టీ నేత మంత్రి నారాయణ పెన్షన్లు అందిస్తూ.. ఫోటోలకు ఫోజులివ్వడం కాదని, పోలీసులతో సమగ్ర విచారణ జరిపి గంజాయి కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. నెల్లూరు నగరానికి గంజాయి ఎక్కువగా ద్విచక్ర వాహనాల్లో తరలి వస్తుందని, దీనిపై పోలీసులు దృష్టి సారించాలన్నారు. ప్రజలు ఈ విధమైన నేర సంస్కృతికి అలవాటు పడటానికి కారణం కూటమి ప్రభుత్వమేనన్నారు. పేదరికం, నిరుద్యోగం, కూలి పనులు లేకపోవడం.. తదితర కారణాలతో కొంత మంది నేరాలనే ప్రవృత్తిగా ఎంచుకోవడం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక.. వాలంటీర్ల ఉద్యోగాలను తొలగించడం, ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పని చేస్తున్న వారిని తీసేయడం.. వారికి నచ్చిన వారిని ఉద్యోగాల్లో పెట్టుకోవడం.. మిగిలిన వారిని తొలగించడం, తదితర కారణాలతో ఎంతో మంది ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. జిల్లా ఎస్పీకి ఎంతో మంచి పేరునప్పటికీ.. నెల్లూరు నగరంలో గంజాయిని నిర్మూలించడంలో విఫలమవుతున్నారన్నారు. పోలీసులు నైట్ బీట్లను ఎక్కువగా నిర్వహించి, గస్తీ ముమ్మరం చేసి.. నేరాలను అరికట్టాలన్నారు. గంజాయిలాంటి మాదకద్రవ్యాల కేసుల్లో దొరికిన వారికి కౌన్సిలింగ్ ఇవ్వడమే కాకుండా.. వారి తల్లిదండ్రులను కూడా పిలిపించి విద్యార్థుల ప్రవర్తనపై వారికి కూడా కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. ప్రజానాట్యమండలి నేత పెంచలయ్య మృతికి.. తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. పెంచలయ్య మృతికి ఈనెల 2వ తేదీ వామపక్షాలు తలపెట్టిన బంద్‌కు తమ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామన్నారు. అనంతరం వైసిపి నగర నియోజకవర్గ కార్యాలయ ఆవరణలో పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి.. వైయస్ఆర్సీపీ నేతలతో కలిసి 'సేవ్ ది నెల్లూరు' ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలియజేశారు. గంజాయి మహమ్మారి నుంచి నెల్లూరును కాపాడాలని నేతలు నినాదాలు చేశారు.

# ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ఆదుకుంటూనే ఉన్నాం

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి నెలా 38687 మందికి రూ. 16.73 కోట్లు, జిల్లాలో 304117 మందికి 132.44 కోట్లు పింఛన్ల పంపిణీ చేస్తున్నట్లు ఆయన అన్నారు. భారతదేశంలోనే ఎక్కడా లేనివిధంగా భారీ బడ్జెట్ కేటాయిస్తున్నామన్నారు. రాష్ట్రం పింఛన్ల కోసం ఏటా రూ.33 వేల కోట్లు ఖర్చు పెడుతున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. వృద్ధులు, వితంతువులు రూ.4 వేలు, దివ్యాంగులు రూ.6 వేలు, మంచానికి పరిమితమైన వారికి రూ.15 వేలు చొప్పున పింఛన్ తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. మహారాష్ట్ర లాంటి పెద్ద రాష్ట్రంలో పింఛన్ల కోసం కేవలం రూ. 8 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేస్తున్నట్లు ఎమ్మెల్యే సోమిరెడ్డి ఈ సందర్భంగా చెప్పడం జరిగింది. పేదలకు అండగా నిలవడమే లక్ష్యంగా సామాజిక పింఛన్లకు సీఎం చంద్రబాబు నాయుడు అత్యంత ప్రాధాన్యత ఎమ్మెల్యే సోమిరెడ్డి తెలిపారు. తెలంగాణలో రూ.2 వేలు, మహారాష్ట్రలో రూ.1,200 తమిళనాడులో రూ.1000, కర్నాటకలో రూ.600 మాత్రమే పింఛన్లు పంపిణీ అవుతున్నాయని ఎమ్మెల్యే అన్నారు. దీపం పథకంలో భాగంగా మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. స్త్రీశక్తి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకంలో రైతులకు ఏడాదికి రూ.20 వేలు అందుతుందన్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రైతులకు కేవలం రూ.13500 మాత్రమే ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. వైసీపీ పాలనలో ఒక బిడ్డకు మాత్రమే అమ్మఒడి ఇచ్చినట్లు ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో ఎంతమంది పిల్లలు ఉన్నా సాయం చేశామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గిరిజనులు గతంలో ఒక బిడ్డను మాత్రమే స్కూలుకు పంపే పరిస్థితి ఉండేదని ప్రస్తుతం ఎక్కువ మంది పిల్లలను స్కూలుకు పంపుతుండటం సంతోషదాయకం అన్నారు. మత్స్యకారులకు వేట విరామ భృతి గతంలో రూ.10 వేలు ఇస్తుండగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం రూ.20 వేలకు పెంచిందన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. భారీ బడ్జెట్ అయినప్పటికీ, చంద్రబాబు నాయుడు తన అనుభవంతో ఈ పథకాలన్నింటిని అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే సోమిరెడ్డి తెలిపారు. ప్రస్తుత టిడిపి ప్రభుత్వ పరిపాలనలో పక్క గృహాల నిర్మాణానికి అధిక నిధులు కేటాయించి గృహాలు పూర్తి చేస్తున్నామని తెలిపారు.

గత వైసిపి ప్రభుత్వం పరిపాలనలో కేంద్రం ఇచ్చే నిధులకు మాత్రమే పరిమితం చేసి, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయికి ఇవ్వకపోగా జగనన్న కాలనీల పేరుతో హడా వుడి చేశారని ఆయన విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గిరిజను లకు రూ.2.55 లక్షలు, దళితులు, బీసీలకు రూ.2.30 లక్షలకు పెంచినట్లు తెలిపారు. నూతనంగా 5 లక్షల ఇళ్లు మంజూరు చేస్తున్నారని నాణ్యతతో ఇళ్ల నిర్మాణం జరుగుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్, ఎంపీడీవో నాగమ ణి, తాసిల్దార్ స్వప్న, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## స్మారక చిహ్నాల సంరక్షణకు ఖర్చు చేస్తున్న నిధులెన్ని ?

(మొదటి పేజీ తరువాయి)



పర్యవేక్షిస్తోందన్నారు. వాటిలో 135 ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో ఉన్నాయని చెప్పారు. పురాతన స్మారక చిహ్నాలు లేదా పురావస్తు ప్రదేశాలు, అవశేషాలను జాతీయ ప్రాముఖ్యత కలిగినవిగా ప్రకటించ డమనేది పురాతన స్మారక చిహ్నాలు, పురావస్తు ప్రదేశాలు, అవశేషాల చట్టం-1958 నిబంధనల ప్రకారం చేపట్టే ఒక సాధారణ ప్రక్రియ అని తెలిపారు. గత 5 సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి సర్కిల్ లో స్మారక చిహ్నం పరిరక్షణ, సంరక్షణ, పర్యావరణ అభివృద్ధి కోసం కేంద్రం నిధులు విడుదల చేసిందని చెప్పారు. 2020-21లో 4.57 కోట్లు, 2021-22లో 5.75 కోట్లు, 2022-23లో 11.60 కోట్లు, 2023-24లో 14.70 కోట్లు, 2024-25లో 6.50 కోట్లు ఖర్చు చేసి నట్లు తెలిపారు. రక్షిత స్మారక చిహ్నాల కోసం ప్రత్యేకంగా అడాప్ట్-ఎ-హెరిటేజ్ 2.0 కార్యక్రమం సెప్టెంబర్ 2023లో ప్రారంభించబడిందని, ఇది ప్రైవేట్/ప్రభుత్వ రంగ కంపెనీలు, ఎన్‌జీఓలు/ట్రస్టులు/సంఘాలు మొదలైన వాటితో పరస్పర చర్చ కోసం ఒక ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించడానికి, సందర్శకుల అనుభవాన్ని మెరుగుపరచడానికి, వాటిని సందర్శకులకు అనుకూలంగా మార్చడానికి స్మారక చిహ్నాల వద్ద సౌకర్యాలను అభివృద్ధి చేయడానికి/అందించడానికి ఉద్దేశించబడిందన్నారు. ప్రపంచ వారసత్వ దినోత్సవం, ప్రపంచ వారసత్వ వారం, అంతర్జాతీయ మ్యూజియంల దినోత్సవం, గణతంత్ర దినోత్సవం, స్వాతంత్ర్య దినోత్సవం, గాంధీ జయంతి వంటి వివిధ సందర్భాలలో పురావస్తు శాఖ ప్రదర్శనలు, వర్క్‌షాప్‌లు, ఇతర కార్యక్రమాల ద్వారా సాంస్కృతిక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. దేశంలోని వివిధ రక్షిత స్మారక చిహ్నాలు, ప్రదేశాలలో పర్యాటకుల అవసరాలకు అనుగుణంగా వసతులు ఏర్పాటు చేయడం జరుగుతుందని వెల్లడించారు. అంతేకాకుండా, తాగునీరు, మరుగుదొడ్లు మరియు బెంచీలు, మార్గాలు, వీల్ చైర్లు, ర్యాంప్‌లు, సైనేజ్‌లు, బ్రెయిలీ సైనేజ్‌లు వంటి సౌకర్యాలు సందర్శకులకు మెరుగైన అనుభవాన్ని అందించడానికి, వాటిని సందర్శకులకు అనుకూలంగా మార్చడానికి వీలవుతుందని, వసతుల మెరుగుదల నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు.

## చిన్నబజార్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేపట్టిన ఐజీ



(మొదటి పేజీ తరువాయి)

పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్, పాత నేరస్థులపై మరింత నిఘా పెంచాలని, చెడు నడత కలిగిన హిస్టరీ షీటర్‌లకు తరచూ కౌన్సిలింగ్ ఇవ్వాలని, క్రిమినల్ చర్యలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని స్టేషన్ సిబ్బందిని ఆదేశించారు. అంతేకాకుండా విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ వ్యవస్థను ముమ్మరం చేయాలని, పెండింగ్ కేసుల విచారణలో వ్యాపియం లేకుండా ఫైనల్ రిపోర్ట్స్ సబ్మిట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. చివరిగా పోలీస్‌స్టేషన్ సిబ్బంది యొక్క యోగక్షేమాలు అడిగి, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని వారి యొక్క గ్రీవెన్స్ ను అడిగి శాఖాపరమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలియజేశారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందే పోలీస్ వ్యవస్థకు వెన్నెముక అని, అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఈ సందర్భంగా ఐజీ సూచించారు. కార్యక్రమంలో టౌన్ ఇన్చార్జి డిఎస్పి, చిన్న బజార్ సీఐ, ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎయిడ్స్ నివారణకు అవగాహన ముఖ్యం : డాక్టర్ మాశిలామణి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ప్రజా ఆరోగ్యానికి పెద్ద సవాలుగా ఉన్న ఎయిడ్స్ వ్యాధి నివారణకు పూర్తిగా నయం చేయడానికి మందులు లేనప్పటికీ సరైన నివారణ చర్యలు మరియు అవగాహనతో వ్యాధి వ్యాప్తిని అరికట్ట వచ్చుని రిటైర్డ్ డిఎం అండ్ హెచ్‌ఓ  డాక్టర్ మాసిలమని పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం పురస్కరించుకొని సోమవారం స్థానిక మాసిలమని వైద్యశాలలో ఎయిడ్స్ నిర్మూలన, అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాసిలమని  మాట్లాడుతూ.. హెచ్‌ఐవి నియంత్రణకు లైంగిక చర్యలో పాల్గొనేటప్పుడు కండోమలను స్థిరంగా సరిగా ఉపయోగించడం ద్వారా వైరస్ బారిన పడకుండా. రక్షణ పొందవచ్చు అన్నారు వ్యాధి సోకిన వారిని ప్రాథమిక దశలో గుర్తిస్తే చికిత్స ప్రారంభించడానికి సహాయపడుతుంద న్నారు. అంతేకాకుండా ఇతరులకు వ్యాప్తి చెందే ప్రమాదాన్ని తగ్గిస్తుంద న్నారు. సూదులు, మాదక దవ్యాలు తీసుకునేవారు ఎప్పుడు కొత్త శుభ్రమైన సూదులను సిరంజలను ఉపయోగించాలన్నారు. అత్యవసర సమయంలో రక్తం స్వీకరించాల్సి వస్తే అది తప్పనిసరిగా హెచ్‌ఐవి ఇతర ఇన్ఫెక్షన్ల కోసం స్క్రీనింగ్ చేయబడిన రక్తం అయ్యి ఉండాలన్నారు గర్భిణీ స్త్రీలకు హెచ్‌ఐవి సోకినట్టు అయితే సరైన సమయంలో యాంటీ రెట్రో వైరల్ తెరిపి చికిత తీసుకోవడం ద్వారా పొట్టబోయే బిడ్డకు వైరస్ సంక్రమించకుండా నివారించవచ్చు అన్నారు. జాగ్రత్తలను పాటించడం ద్వారా ఆరోగ్య వంతమైన సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరు బాగా స్వాములు కావచ్చు అన్నారు కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంత్ ఎఫ్సీబా మల్లికార్జున సుజిత్ శాంతి కీర్తి తిరుమలేశు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో కామ్రేడ్ పెంచలయ్యకు ఘన నివాళి



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం నందు గంజాయి గ్యాంగ్‌చే కిరాతకంగా హత్యకావించబడిన సిపిఎం నాయకుడు ప్రజా నాట్యమండలి గాయకుడు కామ్రేడ్ పెంచలయ్యకు నెల్లూరు రూరల్ మండలంలోని పాత వెల్లంటి గ్రామంలో సిపిఎం పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో సంతాప సమావేశం నిర్వహించడం జరిగింది. చిన్న వయస్సులోనే యువజన సంఘం నాయకుడిగా పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్న ప్రజా గాయకుడు ప్రజా కళాకారుడిగా పెంచలయ్య ఎదిగాడని తెలియజేశారు.  గంజాయి మత్తు పదార్థాలతో యువత జీవితాలు నాశనం కాకూడదని  డ్రగ్స్ వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తూ తాను నివసించే ప్రాంతం లో నెల్లూరు టౌన్ లో మత్తు పదార్ధాలు తీసుకోవద్దని అదే రకంగా అమ్మేవారు, అమ్మవద్దని ప్రచారానికి నాయకత్వం వహిస్తున్నందున గంజాయి గ్యాంగ్ శుక్రవారం సాయంత్రం కల్లూరుపల్లి కాలనీ వద్ద కాపు వేసి  స్కూల్ నుండి స్కూటర్ పై తన కుమారుడుని తీసుకోని వచ్చే సమయంలో దాడి చేసి హత్య చేసారని. హత్య చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. పెంచలయ్య మరణానికి సంతాపం తెలియ చేస్తూ వారి కుటుంభానికి సానుభూతి ప్రకటించారు. సమావేశంలో సిపిఎం నెల్లూరు రూరల్ మండలం కార్యదర్శి జనార్ధన్, నాయకులు చెంచయ్య, సుబ్రహమణ్యం, మస్తాన్  తదితరులు పాల్గొన్నారు.

# తుఫాను ప్రభావం వల్ల పంటల్లో తీసుకోవాల్సిన చర్యలు : లలిత శివజ్యోతి



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాలోని కృషి విజ్ఞాన కేంద్రం నందు దిత్వా తుఫాను ప్రభావం వల్ల పంటల్లో తీసుకోవాల్సిన చర్యలు గురించి డాక్టర్ లలిత శివజ్యోతి మాట్లాడుతూ.. నెల్లూరు జిల్లాలో సాధారణంగా 1,37,364 హెక్టార్లలో సాగుచేసే వరి పంట ప్రస్తుతం కేవలం 16,069 హెక్టార్లలోనే నాటు/నారుమడి దశలో ఉంది. పప్పుధాన్యాలు సాధారణంగా 25,183 హెక్టార్లలో సాగు ఉండగా ప్రస్తుతం 3,075 హెక్టార్లలో మాత్రమే శాకీయ దశలో ఉన్నాయి. అదే విధంగా 2,309 హెక్టార్ల నార్మల్ ప్రాంతం ఉన్న వేరుశనగ పంట ప్రస్తుతం 581 హెక్టార్లలో మాత్రమే మొలక దశలో నమోదైంది. వరి ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో అక్కడక్కడ రైతులు బీపీటీ 5204 రకం నాట్లు వేసిఉన్నారు. చాలామటుకు వరి నారుమడి దశలోనే ఉన్నది. కావున రైతులు తగు జాగ్రతలు తీసుకోవాలి. దిత్వా తుఫాన్ వలన నీరు 5 రోజులవరకు పొలాల్లో ఉండే అవకాశం ఉందిగనుక విత్తనం చల్లిన 2-3 రోజుల నారుమడి పొలాల్లో మల్లి విత్తనం వేసుకోవడం మంచిది. 7 రోజుల పైన వయసుగల నారు మడిలో నీరు వెంటనే తీసివేయాలి. తరువాత పైపాటుగా 5 సెంట్ల నారుమడికి 1 కిలో యూరియ మరియు 1 కిలో పోటాష్ వేసుకోవాలి. తెగుళ్ళు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటాది కావున ఒక లీటరు నీటికి 2 గ్రా. కర్బెండజిం12శాతంమరియు మ్యంకోజెబ్63 శాతం (సాఫ్) లేదా 1 గ్రా. కార్బెండజిం 50శాతం (బావిస్టిన్) మందు ద్రావణాన్ని పిచికారి చేయాలి. 5 కన్న ఎక్కువ రోజులు నీటమునిగిన నారుమడులు మల్లి వేసుకోవడం మంచిది. నాట్లువేసిన పొలంలో (పిలకల దశలో) నుంచి నీటిని బయటకు పంపిన తరువాత ఎకరానికి  20 కిలోల యూరియా, 20కిలోల పొటాష్ అదనంగవేసుకోవాలి. మినుములు నెల్లూరు జిల్లాలో చాల ప్రాంతాలలో మినుము పంట ప్రస్తుతం శాకీయదశలో ఉంది. వర్షం ఆగిన వెంటనే పొలంలోనుంచి నీటిని బయటకు పంపే మార్గాలు చేయాలి. ఇనపధాతు లోపం కనిపించే అవకాశం ఉంది కావున ఒక లీటరు నీటికి 5 గ్రా. అన్నభేది, 1 గ్రా. నిమ్మ ఉప్పు 5 గ్రా., 10 గ్రా. యూరియా కలిపుకొని పిచికారీ చేయాలి. ఒక వారం తరువాత ఒక లీటరు నీటికి 10 గ్రాముల 19:19:19 లేదా పొటాషియం నైట్రేట్ ను  పిచికారీ  చేయాలి. కుళ్ళు, మచ్చ తెగులు ఆశించకుండా ఒక లీటరు నీటికి 2 మి.లీ. హెక్సకొనజోల్ లేదా 1 మి.లీ. ప్రోపికోనజోల్ మందు ద్రావణాన్ని పిచికారి చేయాలి. చిత్తపురుగులు, మారుక మచ్చల పురుగు ఆశించే అవకాశం ఎక్కువగా ఉన్నది కావున 2.5 మి.లీ క్లోరిపైరిఫాస్ 20 ఈసీ లేదా 1.0 మి.లీ. నోవల్యురాన్ 10 ఈసీ ఒక లీటరు నీటికి కలుపుకొని పిచికారి చేసుకోవాలని తెలియజేశారు.

# ఉదయం 8గంటలకే వందవాతం ఫించన్లు పంపిణీ



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పొదలకూరు మండలంలోని బిరదవోలు  సచివాలయం పరిధిలోని పార్లపల్లి పంచాయతీలో సోమవారం ఉదయం 8 గంటలకే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు నూరు శాతం పంపిణీ పూర్తయింది. సచివాలయ సర్వేయర్ వెంకటేశ్వర్లు తో కలిసి మండల తెలుగు యువత అధ్యక్షుడు వెన్నపూస రాజశేఖర్ రెడ్డి, సర్పంచ్ గూడూరు ప్రసన్న, ఉప సర్పంచ్ అన్నలూరు చెన్న కృష్ణమ నాయుడు, గ్రామ టిడిపి నాయకులు గూడూరు శ్రీనివాసులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ప్రతి ఇంటికి వెళ్లి పెన్షన్ల నగదును అందజేయడం జరిగింది. గ్రామంలోని వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, మంచానికే పరిమితం అయిన వారు మొత్తం నూట పద్దెనిమిది (118)మందికి పెన్షన్ల మొత్తాన్ని అందజేసినట్లు వారు వివరించారు. ఈ సందర్భంగా కొంతమంది లబ్ధిదారులు మాట్లాడుతూ.. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఉదయాన్నే తమకు పెన్షన్లు మొత్తాన్ని అందించిన అధికారులు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ టిడిపి నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయడంలోనూ, లబ్ధిదారులకి అందించడం లేనూ తామంతా ఐకమత్యంగా పనిచేస్తామన్నారు. ఐకమత్యమే తమ బలమని వారు సందర్భంగా వివరించారు.

## దిత్వా తుఫానుతో గిరిజన ప్రాంతాలు అతలాకుతలం




**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** దిత్వా తుఫాను ప్రభావంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న మండలంలోని రవీంద్రపురం గిరిజన కాలనీలో సోమవారం పరిస్థితులను తెలుసుకునేందుకు చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇరగనబోయిన శ్రీనివాసరావు, జయవర్ధన్ సేవా ట్రస్ట్ డైరెక్టర్ గంటా వెంకట రవికుమార్ కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వీరు వీలుకానిపల్లి, వెంకన్నపాలెం, రవీంద్రపురం, శివరాంపురం, కొల్లిదిబ్బ, గణపతి నగర్ గ్రామాల్లో గిరిజన కుటుంబాలను సందర్శించి వారి సమస్యలను ఆరా తీశారు. తుఫాను సమయంలో ప్రభుత్వం జారీ చేసిన సూచనలను తప్పనిసరిగా పాటించాలని, ప్రమాదం పెరిగితే వెంటనే పునరావాస కేంద్రాలకు చేరుకోవాలని ప్రజలకు సూచించారు. తుఫాను గాలుల ధాటికి దెబ్బతిన్న పూరి గుడిసెలను పరిశీలించి,వాటి మరమ్మతులకు చైతన్య జ్యోతి వెల్ఫేర్ సొసైటీ మరియు జయవర్ధన్ సేవా ట్రస్ట్ కలిసి సహాయం అందించనున్నట్లు తెలిపారు. శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కూడా గిరిజనులపై ప్రత్యేక అభిమానం చూపిస్తున్నారని వారు తెలియజేశారు. ఇంతకుముందు మొంత తుఫానులో ఆరు గ్రామాల్లోని 197 గిరిజన కుటుంబాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇరగనబోయిన శ్రీనివాసరావు, ఫౌండర్ జయలక్ష్మి, ట్రస్ట్ డైరెక్టర్ గంటా వెంకట రవికుమార్, గురుదేవి, కనకాద్రి, సుజిత్ పాల్గొన్నారు.

## గంజాయి, డ్రగ్స్‌ను నివారించాలంటూ వినతి



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలో గంజాయి, డ్రగ్స్ సరఫరా నిర్మూలించాలని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశాల మేరకు మర్రిపాడు తహసీల్దారు అనిల్ కుమార్‌కి సోమవారం వైస్సార్సీపీ మండల యువత, విద్యార్థి కమిటీల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేవారు. ఈ సందర్భంగా వైస్సార్సీపీ మండల యువత, విద్యార్థి అధ్యక్షులు చంద్ర నారాయణస్వామి, గంగినేని.విజయ్ కుమార్‌లు మాట్లాడుతూ.. జిల్లాలో ఇటీవల గంజాయి, డ్రగ్స్ మాఫియా వల్ల బలయిన పెంచలయ్య హత్యను తీవ్రంగా ఖండించడమైనది. మర్రిపాడు మండలంలో కూడా చాప కింద నీరులా గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా ప్రభలుతుందన్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు దీనికి బలవుతున్నారన్నారు. వెంటనే గంజాయి, డ్రగ్స్ మాఫియాని ఈ ప్రాంతంలో అరికట్టకపోతే, నెల్లూరులో లాగానే ఇక్కడ కూడా జరిగే అవకాశం ఉందన్నారు. సచివాలయ సిబ్బంది ద్వారా సమాచారం తెప్పించుకొని గంజాయి, డ్రగ్స్ సరఫరా చేసేవాళ్ళ పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకొని, యువత, విద్యార్థుల భవిష్యత్ ను కాపాడాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో నర్సయ్య, సింహాద్రి, రంగస్వామి, బాల మురళి తదితర యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

## దిత్వా తుఫాను సైతం లెక్కచేయని తెలుగు తమ్ముళ్లు



**కోవూరు, మేజర్‌న్యూస్ :** ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశాలతో కోవూరు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్‌రెడ్డి, ఇనమడుగు గ్రామ ఎంపీటీసీ కొల్లారెడ్డి సునీల్‌రెడ్డి, కోవూరు మండలంలో అన్ని గ్రామాల నాయకులను కార్యకర్తలను కలుపుకొని వారి ఆధ్వర్యంలో  లేగుంటపాడు, ఇనమడుగు, చెర్లోపాలెం, వేగూరు, వసంతపురం, కోవూరు, పడుగుపాడు, పోతిరెడ్డిపాలెం, గంగవరం 9 పంచాయతీలలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జోరుగా కొనసాగింది. ప్రతి పంచాయతీలో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి  పెన్షన్లను అందించడం జరిగింది. దీంతో లబ్ధిదారులు  హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# జిగ్మా కంపెనీ సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా లిఫ్ట్ ఇరిగేషన్ పనులు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధి లోని ఆమంచర్ల గ్రామ పంచాయతీ మన్నవరప్పాడు, గోటురువారికండ్రిగ గ్రామాలకు సాగునీరు అందజేసేందుకు జిగ్మా కంపెనీ సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా 30లక్షల రూపాయల వ్యయంతో లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గత 30 సంవత్సరాలుగా ఆమంచర్ల గ్రామ పంచాయతీ మన్నవరప్పాడు, గోటురువారికండ్రిగ గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్య పరిష్కారం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పి4 కార్యక్రమంలో భాగంగా జిగ్మా కంపెనీ ద్వారా సిఎస్ఆర్ ఫండ్స్ 30లక్షల రూపాయల నిధులు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు తీసుకురావడం సంతోషకరం అని తెలియజేశారు. అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నెల్లూరు రూరల్ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తు నందుకు నెల్లూరు రూరల్ ప్రజల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలియ జేశారు. అలాగే నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి పి4 కార్యక్రమంలో భాగంగా 30లక్షల రూపాయల నిధులు కేటాయించిన జిగ్మా కంపెనీకి ఆమంచర్ల గ్రామ ప్రజల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ జలదంకి సుధాకర్, జడ్పీ కో ఆప్షన్ మెంబర్ అల్లాబక్షు, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం ఇంచార్జ్ దాట్ల చక్రవర్ధన్ రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం మండల ఇంచార్జ్ వేమిరెడ్డి సురేందర్ రెడ్డి, టిడిపి నాయకులు మల్లినేని వేణు నాయుడు, జి.వెంకటేశ్వర్లు నాయుడు (జి.వి.యన్.), నెల్లూరు రూరల్ టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు నంబూరు వెంకట రమణమ్మ, టిడిపి నాయకులు వాకా వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు నాయుడు, మురళి నాయుడు, దాసరి అశోక్, రఘురామయ్య, పుట్టయ్య, గంగయ్య, భాస్కర్ నాయుడు, ప్రతాప్ నాయుడు, కరీముల్లా, వలిపి వెంకటేశ్వర్లు, సయ్యద్ బాబు, గుంటి రమేష్, రఘురామయ్య, షేక్.మస్తాన్ వల్లి తదితరులు పాల్గొన్నారు.

# పీఎంపీ అసోసియేషన్‌కి మెమొంటో ప్రశంసా పత్రం

## వరల్డ్ ఎయిడ్స్ డే అవార్డు అందుకున్న శాఖవరపు వేణుగోపాల్




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా డిసెంబర్ నెల్లూరు, టౌన్ హాల్ నందు జరిగిన వరల్డ్ ఎయిడ్స్ డే కార్యక్రమంలో హెచ్ఐవి/ ఎయిడ్స్ పట్ల గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీ షనర్ అసోసియేషన్ (పియంపి)కి ప్రశంసా పత్రం, మెమెంటోను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.ఏ.సుజాత, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ షేక్ షేక్ ఖాదరవల్లి చేతుల మీదుగా జిల్లా అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్ అందుకున్నారు. ఈ సందర్భంగా శాఖవరపు వేణుగోపాల్ మాట్లాడుతూ.. 1998 సంవత్సరం నుంచి పిఎంపి అసోసియేషన్ సభ్యులు ప్రాథమిక వైద్యం చేస్తూ, ప్రాణాంతక వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తూ, ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తూ, వ్యాధుల పట్ల ప్రజలను చైతన్య పరుస్తున్నామని, దానిని గుర్తించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నియంత్రణ శాఖ ప్రతి సంవత్సరం ప్రశంసాపత్రం, మెమొంటోను ప్రధానం చేస్తున్నారన్నారు. డిఎల్ఓ డాక్టర్ ఖాదరవల్లి జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రతి యూపీహెచ్‌సి, పిహెచ్‌సి మండల హెడ్ క్వార్టర్ నందు హెచ్ఐవి/ ఎయిడ్స్, లెప్రసీ, క్షయ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ చైతన్య పరుస్తున్నా రని, ఆ కార్యక్రమాలలో మా సభ్యులను కూడా భాగస్వామ్యం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఎంపీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీని వాసులు, నరసాపురం ప్రసాద్, బైరి శంకర్రావు, రాజశేఖర్, మోహన్, రామ రాగవయ్య, ఆర్ఎంపీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోవిందస్వామి, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారులకు వ్యాధులపై కూడా అవగాహన కల్పించాలి

## భగవద్గీత ప్రచారకులు బ్రహ్మశ్రీ రాధా మనోహర్ దాస్



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** చిన్నారులు విద్యాతో పాటు వ్యాధులుపై కూడా అవగాహన కల్పించాలని రాధా మనోహర్ దాస్ అన్నారు. సోమవారం నాడు నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని కొండాయపాలెం గేటు, శ్రీకృష్ణ ధ్యాన మందిరం ఆవరణంనందు గీతా వైభవ ట్రస్ట్, బ్లాక్ బోర్డ్ మిత్ర మండలి, శ్రీసాయి ధ్యాన మందిరం, పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ వైద్యులు (పీఎంపీ) ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్నారని, వారి సేవలు సమాజానికి ఎంతో అవసరమని ఆయన కొనియాడారు. ప్రకృతి వైపరీత్యాలు, పండుగలు, తిరునాళ్లు, జాతరలు జరిగినప్పుడు వారు చేస్తున్న ప్రాథమిక వైద్య సేవలు ప్రశంసనీయమన్నారు. విద్యా, వైద్యం ప్రతి ఒక్కరికి అందుబాటులోకి రావాలని ఆయన కోరారు. మేనేజింగ్ ట్రస్టీ, స్వర్ణ భారత్ ట్రస్ట్ ఇమ్మణి దీపావెంకట్ మాట్లాడుతూ.. పేదప్రజల ఆరోగ్య రక్షణ కొరకు పిఎంపి సంస్థ నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలు ఎంతో అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా దీప వెంకట్‌ను, రాధా మనోహర్‌ను బీబీఎంఎం, పీఎంపీ అసోసియేషన్ నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఉచిత వైద్య శిబిరాన్ని గీతా ప్రబోధిక్ బ్రహ్మశ్రీ షేక్ నజీర్ భాషా గురూజీ ప్రారంభించి మాట్లాడుతూ.. నెల్లూరులో గీతా వైభవ్ ట్రస్టు, గీతా జయంతి సందర్భంగా గత మూడు సంవత్సరాల నుంచి బ్లాక్ బోర్డ్ మిత్రమండలి, పీఎంపీలు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి భక్తులకు అవసరమైనటువంటి మందులు పంపిణీ చేయడం ఎంతో అభినందనీ యమన్నారు. ఈ కార్యక్రమంలో పీఎంపీ జిల్లా గౌరవాధ్యక్షులు అనుముల జయప్రకాష్, అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్, బ్లాక్ బోర్డ్ మిత్ర మండలి అధ్యక్షులు నరసాపురం ప్రసాద్, సభ్యులు బైరి శంకర్రావు, హారిక, పర్వీన్, మహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.



# జోరు వర్షంలో సైతం పింఛన్ల పంపిణీ

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా జనసేన పార్టీ సీనియర్ నాయకులు, మున్సిపల్ కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యులు నూనె మల్లికార్జున యాదవ్ , కూటమి టిడిపి సీనియర్ నాయకులు కిలారి తిరుపతి నాయుడు, జనసేన పార్టీ 37వ డివిజన్ ఇంచార్జ్ షేక్ షానవాజ్ గారి ఆధ్వర్యంలో జోరు వర్షంలో కూడా ఎక్కడ పెన్షన్లు ఆగకూడదనే సూచనలని తూచా తప్పకుండా పాటిస్తూ ఎంతోమంది నిరుపేద వృద్ధాప్యులు, వికలాంగులు, వితంతువుల, ఒంటరి మహిళ పెన్షన్ల పంపిణీని దిగ్విజయంగా ఉదయం 7:00 సమయం నుండి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో చల్లా



**వింజమూర, మేజర్‌న్యూస్ :** ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ పాల్గొన్నారు. పశుసంవర్ధక శాఖ సహాయకులు వి.శేఖర్‌తో కలిసి పింఛన్లను పంపిణీ చేశారు. పంచాయతీ పరిధిలోని బొమ్మరాజు చెరువు గ్రామంలో సోమ వారం ఇంటింటికి తిరిగి పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం చెప్పిన మాటలు నిలబెట్టుకుం టుందని అందులో భాగంగానే భరోసా పింఛన్లను ఒకటవ తేదీకే ఎన్ని కష్టాలు ఉన్నా అందిస్తుందని తెలిపారు. అలాగే స్పౌజ్ పింఛన్లను కూడా అందిస్తుందని ఆయన తెలిపారు. వృద్ధులు వికలాంగులు వితంతువులు ఒంటరి మహిళల కళ్ళలో ఆనందం చూడడమే ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులున్నారు.

# జోరు వర్షంలో ఫించన్లు పంపిణీ



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు పట్టణంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను తెలుగుదేశం పార్టీ నాయకులు పంపిణీ చేశారు. స్థానిక నడిమూరులో సొసైటీ డైరెక్టర్ కోడూరు నాగిరెడ్డి, మండల టీడీపీ కో కన్వీనర్ మంచాల శ్రీనివాస్ నాయుడు మండల కో కస్టర్ ఇన్‌చార్జ్ పాములపాటి మాలాద్రి నాయుడు నాయకులు దుద్దు గుంట శ్రీనివాస్ రెడ్డి కర్ణం శ్రీనివాసులు నాయుడు పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా. చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు ప్రతినెల పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో అధికారులతో పాటు స్థానిక నేతలు వెళ్లి పెన్షన్ దారులు ఇంటి వద్దనే పెన్షన్ను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం పరిపాలన వివరిస్తూ పెన్షన్ దారుల యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ పింఛన్లను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

# జోరుగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి నియోజవకర్గ వైసీపీ ఇన్‌చార్జ్ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సూచన మేరకు సోమవారం రాత్రి మండల పరిధి లోని తిరుమలపురం, గుడినారవ, సున్నం వారిచింతలలో వైసీపీ నాయకులు కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైసీపీ కన్వీనర్ కొండా రాజగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాల కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం 17 ప్రభుత్వ మెడికల్ వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ కళాశాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పడం దారుణమని, వెంటనే ప్రైవేటీకరణను నిలిపి పేద, మధ్యతరగతి పిల్లలకు వైద్య విద్యను దగ్గర చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అన్నాలోచిత నిర్ణయంను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు నారాయణరెడ్డి, జనార్ధనరెడ్డి, అంబటి సుబ్బారెడ్డి, ఏసీ సెల్ నాయకులు గురవయ్య, కారుదుంప రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీలో ఎమ్మెల్యే కాకర్ల



**కలిగిరి/వింజమూరు, మేజర్‌న్యూస్ :** కలిగిరి మండలం గంగిరెడ్డిపాలెం గ్రామంలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హాజరై, స్వయంగా లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. రాజాల రత్నమ్మ భర్తకు గతంలో ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ ఆయన మరణంతో నిలిచిపోయింది. కొత్తగా ప్రవేశపెట్టిన స్పౌస్ పింఛన్ పథకం కింద ఆమెకు ఆ పింఛన్‌ను కేటాయించగా, ఆ తొలి పింఛన్‌ను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేతుల మీదుగా ఆమెకు అందించారు. అదే విధంగా వితంతు, వికలాంగ, వృద్ధాప్య తదితర అన్ని రకాల పెన్షన్లను ఎమ్మెల్యే స్వయంగా లబ్ధిదారులకు అందించి, ప్రభుత్వం అందించే సహాయాన్ని నేరుగా ప్రజల దాకా తీసుకువెళ్లే విధానాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు పింఛన్ మొత్తాన్ని పెంచి ప్రతి లబ్ధిదారుడికి అందుబాటులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయం వేలాది కుటుంబాలకు ఆర్థికంగా గట్టి తోడ్పాటును అందించడమే కాక, ప్రభుత్వంపై ప్రజల నమ్మకాన్ని మరింత బలపరిచింది. ప్రతి పేదవాడికి, అవసరమైన ప్రతి వ్యక్తికి సహాయం అందేలా చూడటం తమ ప్రభుత్వ ధ్యేయమని, సామాజిక న్యాయం సాధనలో కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడుతుందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, అధికారులు, గ్రామ ప్రజలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రామలింగేశ్వర స్వామి వారి బాలాలయ ప్రవేశం



**కలిగిరి/వింజమూరు, మేజర్‌న్యూస్ :** కలిగిరి మండల కేంద్రమైన కలిగిరి గ్రామంలో వెలసి ఉన్న శ్రీ పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో బాలాలయ ప్రవేశం (కళాపకర్షణ) కార్యక్రమం భక్తి భరిత వాతావరణంలో ఎంతో వైభవంగా నిర్వహించబడింది. దేవాలయ ప్రాంగణమంతా వేదమంత్రోచ్చారణలు, నాదస్వర ధ్వనులు, మంగళభేరి నినాదాలతో కళకళలాడింది. స్థానిక భక్తులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కాకర్ల సురేష్, ప్రజలకు అండగా నిలుస్తూ సేవాభావంతో ముందుకు సాగే మన ప్రియతమ నాయకులు కాకర్ల సురేష్ కలిగిరి గ్రామానికి విచ్చేసి స్వామివారి బాలాలయ ప్రవేశాన్ని ప్రత్యక్షంగా దర్శించి, ప్రత్యేక పూజలకు హాజరై, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే రాకతో కార్యక్రమానికి మరింత శోభ పెరిగింది. స్థానిక ప్రజలు ప్రేమాభిమానాలతో స్వాగతం పలికారు. గ్రామాభివృద్ధి, దేవాలయ పునర్నిర్మాణ కార్యక్రమాలపై ఆయన అభిప్రాయాలు తెలియజేసి, భక్తుల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని అన్నారు. ఈ పవిత్ర కార్యక్రమంలో గ్రామ నాయకులు, మండల ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళామండలి, యువసేవా సంఘాలు, ప్రాంతీయ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందే భాగ్యాన్ని సొంతం చేసుకున్నారు.

# నెల్లూరు సిటీ పరిధిలోని రౌడీ షీటర్లకు విభిన్న రీతిలో కౌన్సిలింగ్



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు పట్టణ పరిధిలో ఉన్న చెడు నడత, నేరచరిత్ర ఉన్న హిస్టరీ షీటర్లకు సోమవారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నెల్లూరు పోలీస్ అధికారులు విభిన్న రీతిలో కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్‌లో భాగంగా ఈ పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంగా స్థానిక వీఆర్సి సెంటర్ నుండి గాంధీ బొమ్మ వరకు సుమారు ఒక కిలోమీటర్ వారిచేత ప్రత్యేక పెరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు సిటీ పరిధిలో ఉన్న అత్యంత చురుకైన రౌడీషీటర్లకు సముచితంగా కౌన్సిలింగ్ చేయడంతో పాటు తగిన హెచ్చరికలు జారీ చేశారు. అనంతరం రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల అందరితో ఇలాంటి నేర కార్యకలాపాలలో పాల్గొనబోమని, సత్ప్రవర్తన కలిగి ఉంటామని ప్రమాణం చేయించి అండర్ టేకింగ్ తీసుకున్నారు. అదేవిధంగా నెల్లూరు జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ శాఖ ఈ విధమైన కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా నిరంతరం కొనసాగిస్తుందని ఈ సందర్భంగా పోలీసు అధికారులు తెలియజేశారు. ఈ పెరేడ్‌లో చిన్న బజార్, వేదాయపాలెం, బాలాజీ నగర్ పరిధిలోని ఇన్‌స్పెక్టర్లతోపాటు వారి సిబ్బంది పాల్గొన్నారు.

# బోధన, పరిశోధనల్లో ఏఐ వినియోగం అవసరం




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 'బోధన, పరిశోధనలో ఏఐ అనుసంధానం' అంశంపై 5రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డిపి) సోమవారం ప్రారంభమైంది. రిజిస్ట్రార్ డాక్టర్ కే.సునీత దీపప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మారుతున్న సాంకేతిక తరుణంలో అధ్యాపకులు ఏఐ టెక్నాలజీని నేర్చుకుని బోధనా నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని సూచించారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా ఎన్ఐటిపి ఐటీటీ, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ హెడ్ ఆచార్య కే. శ్రీనివాస్ హాజరై ప్రసంగించారు. టెక్నాలజీ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నాయని, పరిశోధన నాణ్యత పెంపు, బోధన సులభతరం చేయడంలో ఏఐ కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. రాబోయే ఐదు రోజుల పాటు అధ్యాపకులకు ఏఐ టూల్స్ వినియోగంపై ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్. విజయ, డా. ఎం.ఉస్సేనయ్య, డాక్టర్ జి.విజయలక్ష్మి, కంప్యూటర్ సైన్స్ విభాగ అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.



## పింఛన్ల పంపిణీ చేసిన టీడీపీ యువ నాయకులు



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండలంలోని మర్లపూడి సచివాలయం పరిధిలో టిడిపి నాయకులు, కార్యకర్తలు సోమవారం పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మర్లపూడి పంచాయతీ నాయకుడు వరద బండి వెంకటేశ్వర్లు రెడ్డి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం ఇస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లలో భాగంగా వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కురుగుండ్ల రామకృష్ణ ఆదేశాలతో ఈ నెల కొత్తగా మంజూరైన వితంతు పెన్షన్ దారులకు తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు వరద బండి వెంకటేశ్వర్లు రెడ్డి ద్వారా పెన్షన్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ పార్టీ పేద బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటుందని యువ నాయకుడు వరద బండి వెంకటేశ్వర్లు రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మర్లపూడి తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు వరద బండి వెంకటేశ్వర్లు రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గొల్లపల్లిలో ఎన్టీఆర్ భరోసా ఫించన్లు పంపిణీ



**చేజర్ల, మేజర్‌న్యూస్ :** ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, సూచనతో, ఆత్మకూర్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కిమ్స్ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాళ్లూరి గిరినాయుడు ఆదేశాలతో చేజర్ల మండలం గొల్లపల్లి గ్రామం నందు సోమవారం తెలుగుదేశం పార్టీ నాయకులు, 24 ఎల్ సోమశిల కాలువ చైర్మన్ ఉడత హజరత్తయ్య పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పెన్షనర్లకు నగదు అందచేశారు.

## నెల్లూరు ఇస్కాన్‌లో గీత జయంతి వేడుకలు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు ఇస్కాన్ మందిరంలో గీత జయంతి వేడుకలు అత్యంత వైభవముగా నిర్వహించారు. ఇస్కాన్ అధ్యక్షులు సుఖదేవ్ స్వామి గీత జయంతి గురించి భక్తులకు వివరించారు. గీతా జయంతి అనేది హిందూ పవిత్ర గ్రంథమైన భగవద్గీత ఆవిర్భవించిన రోజు. కర్తవ్య నిర్వహణ గురించి తికమక పడుతున్న అర్జునుడికి ఉపశమనం కలిగించడానికి, శ్రీకృష్ణుడు భగవద్గీతను ఉపదేశించాడు. ఇది అర్జునుడికి మాత్రమే కాకుండా, సమస్త లోకానికి అందించిన మహోపదేశం. శ్రీకృష్ణుని ఉపదేశం ద్వారా అర్జునుడు తన కర్తవ్యాన్ని తెలుసుకొని, మనోబలాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పొంది యుద్ధం చేయడానికి సిద్ధమయ్యాడు. ఈ విధంగా, కురుక్షేత్ర యుద్ధ భూమిలో శ్రీకృష్ణుడు అర్జునుడికి బోధించిన ఈ 700 శ్లోకాల దివ్య సందేశమే భగవద్గీత. ఈ పవిత్ర గ్రంథం ఆవిర్భవించిన రోజును హిందువులు అత్యంత పవిత్రంగా గీతా జయంతిగా జరుపుకుంటారు. భగవద్గీత అనేది మానవ జీవితంలో ఒక మాన్యువల్ లాంటిదని సుఖదేవ్ స్వామి అన్నారు. భక్తులందరూ కలిసి 18 అధ్యాయాలు 700 శ్లోకాలను ఉచ్చరించారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్లు ఆవిష్కరించారు.

# తండ్రి చేతిలో తనయుడు హతం

● మద్యం తెచ్చిన తంటా ● ఫించన్ డబ్బువద్ద వివాదం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మద్యం వ్యసనం, పెన్షన్ నగదు అడగడంతో రేగిన వివాదం వెరసి తండ్రి చేతిలో తనయుడు హతమైన సంఘటన సోమవారం ఆత్మకూరు మండలం బట్టేపాడు ఎస్‌సి కాలనీలో చోటుచేసుకుంది. కాలనీకి చెందిన మామ్ముడూరు మస్తానయ్య(33) అనే యువకుడిని తండ్రి పుల్లయ్య కర్రతో కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు, సమాచారం అందగానే ఆత్మకూరు సిఐ గంగాధర్ హుటాహుటిన బట్టేపాడుకు వెళ్లి ప్రాథమిక విచారణ జరిపారు. పుల్లయ్యకు సోమవారం ఉదయం ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్ నగదు చేతికందింది. ఆ డబ్బు తనకివ్వాలని మద్యపాన ప్రియుడైన కుమారుడు మస్తానయ్య అడగడం, అందుకు తండ్రి తిరస్కరించడంతో బలవంతపెట్టడంతోపాటు తండ్రిపై చేయిచేసుకున్నాడు. దాంతో తండ్రి తప్పించుకోలేక ఒక కర్రతో కుమారుడిని కొట్టడంతో ఆయన మృతిచెందాడు. గ్రామస్థుల వివరాల మేరకు మస్తానయ్య మద్యపాన ప్రియుడని, మద్యపానం వ్యసనంగా ఉంటుందని, ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తుండేవాడని, వివాదాస్పదుడని, ఆయన వేధింపులు తట్టుకోలేక ఆయన భార్య తన ఇద్దరు కుమార్తెలతో పుట్టినిల్లు పేరారెడ్డిపల్లిలో ఉంటుందని తెలిపారు. అక్కడకు కూడా వెళ్లి ఆమెను ఇబ్బందిపెడుతుంటాడని చెబుతున్నారు. సోమవారం తనతండ్రి పుల్లయ్యకు పెన్షన్ డబ్బు రాగా ఆ నగదును తనకివ్వాలని మస్తానయ్య బలవంతం చేయడం, వివాదం రేగడం, తండ్రిపై





చేయిచేసుకోవడం, ఆయన కర్రతో కొట్టడం, ప్రధానమైన శరీరభాగంలో దెబ్బతగలడంతో ఆయన మృతిచెందడం జరిగిందని చెబుతున్నారు. మద్యం వ్యసనం ఇంతటి దారుణ సంఘటనకు దారితీసిందని, మస్తానయ్య కాలనీలో, గ్రామంలో తరచూ వివాదాలు సృష్టిస్తుంటాడని చెబుతున్నారు. తరచూ కాలనీలో సైడుకాలువల్లోనుండి నీరు వెళ్ళకుండా అడ్డుకట్ట వేస్తుండేవాడని, ఏదో ఒక వివాదానికి కారుకుడవుతుండేవాడని చెబుతున్నారు. మస్తానయ్య హత్యపై ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. మస్తానయ్య మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకై ఆత్మకూరులోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



## ఒకటో తేదీనాడే పింఛన్ పంపిణీ : తుమ్మల

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ప్రతి నెలమొదటి రోజునే వృద్ధులు, వికలాంగులు, కళాకారులు, వితంతువులు, దీర్ఘకాలవ్యాధిగ్రస్థులు తదితరులందరికీ వారి ఇళ్ళవద్దకే సచివాలయ సిబ్బంది వెళ్ళి పెన్షన్లు పంపిణీ చేస్తుందని, తాముకూడా భాగస్వామ్యులవుతూ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నామని, పెన్షన్లు లబ్ధిదారులకు అందజేస్తున్నామని, తమ కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి, పెన్షనర్లపట్ల ఉన్న అభిమానం, ఆదరణకు నిలువెత్తు సాక్ష్యమని, 1వతేదీ సెలవుదినమైతే ముందురోజే పంపిణీ చేస్తున్నామని ఆత్మకూరు పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు, మున్సిపాలిటీ మాజీ వైస్‌చైర్మెన్ తుమ్మల చంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ప్రాత:కాలంనుండే ఆయన 8,9వార్డుల్లో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. సచివాలయ సిబ్బందితోపాటు ఆయన ఇంటింటికెళ్ళి పెన్షన్లు పంపిణీ చేశారు. పట్టణంలో పెన్షన్ల పంపిణీని పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో 200రూపాయల పెన్షన్‌ను 2వేల రూపాయలకు పెంచారని, గత ప్రభుత్వం ఐదేళ్ళపాటు 250వంతున 3వేల రూపాయలకు పెంచగా చంద్రబాబునాయుడు పదవిచేపట్టగానే నాలుగు వేలకు పెంచడంతోపాటు మూడునెలల అరియర్స్‌ను కూడా కలిపి ఇళ్ళవద్దనే పంపిణీ చేయించారని పేర్కొన్నారు. నెల మొదటి రోజు సెలవుదినమైతే ముందురోజే పెన్షన్ పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు. అన్నివర్గాల సంక్షేమం, అన్నిప్రాంతాల అభివృద్ధితో పాటు అందరికీ ప్రతినెలా 1వతేదీనాడే పెన్షన్‌లను పంపిణీ చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి నిర్ణయానుసారం, రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలతో తామంతా పెన్షనర్ల ఇళ్ళవద్ద పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటున్నామని చంద్రారెడ్డి పేర్కొన్నారు. కాగా ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో తెలుగుదేశం ప్రజాప్రతినిధులు, నాయకులు పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రైతులకు యూరియా పంపిణీ

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండల పరిధిలోని చంద్ర పడియ గ్రామంలో సోమవారం సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్ ఆధ్వర్యంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల ప్రస్తుతం వరి నాట్లు జోరుగా వేస్తున్నారని వారికి అవసరమైన యూనియన్ అందించడం సరైన విధంగా



అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. అవసరానికి యూరియా అందిస్తే పంటను పండించే రైతులకు సంతోషంగా ఉంటుందని ఆయన తెలిపారు. వరికి ఎకరాకు మూడుసార్లుగా మూడు బస్తాలు మెట్ట పైర్లకు ఎకరాకు బస్తా వుంతున ఏరియా అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కావున రైతన్నలు యూరియా అవసరమైన మేర వాడుకుంటూ నాని యూరియా ఉత్పత్తులను వాడుకొని నాణ్యమైన పంటలను పండించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వాసు పి మాల్యాద్రి దొరస్వామి నాయుడు షేక్ మహబూబ్ బాషా గ్రామ రైతులు తదితరులు ఉన్నారు.

## తుఫాన్ సైతం లెక్కచేయకుండా.. ఫించన్ పంపిణీ : మంత్రి నారాయణ

*(మొదటి పేజీ తరువాయి)*

నుండి పెన్షన్ పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. 68 లక్షల మందికి పెన్షన్లు అందజేస్తున్నట్లు.. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారమే పెన్షన్‌దారులకు పెన్షన్ పెంచడం జరిగిందని మరోసారి గుర్తు చేశారు. దాదాపు 34 వేల కోట్ల రూపాయలు పెన్షన్లు అందజేస్తున్నామని, ఇవ్వని హామీలను కూడా ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. భారతదేశంలో కూడా ఎక్కడ ఇంత మొత్తంలో పెన్షన్ ఇవ్వడం లేదన్నారు. ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా సీఎంకు ఉన్నటువంటి అపారమైన అనుభవంతో హామీలు అమలు చేస్తు, కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 90శాతం పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. అదేవిధంగా మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామని, జూన్ 12వ తేదీ నుంచి 67 లక్షల మందికి తల్లికి వందనం అమలు చేస్తున్నామన్నారు. రైతులకు 20 వేలు అందించామని, ఆగస్టు నుండి మహిళలకు కూడా ఉచిత బస్సు అమలు చేశామని మరోసారి గుర్తు చేశారు. ఇప్పటికే 200 అన్నా క్యాంటీన్లో 100 రోజులు పూర్తి చేశామన్నారు. మరో వంద అన్నా క్యాంటీన్లో సిద్ధం చేస్తున్నామని, అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు సాగుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. మేనిఫెస్టోలో చెప్పినవన్నీ వందకు వంద శాతం అమలు చేస్తామని ఘంటాపదంగా చెప్పారు. అనంతరం నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి నారాయణ క్రమశిక్షణకు మారుపేరని, జోరు వానలో సైతం లెక్కచేయకుండా సమయానికి వచ్చి పెన్షన్ పంపిణీ చేయడం, అందులో మంత్రిగా నెల్లూరు నగర ఎమ్మెల్యే కావడం నియోజవర్గవాసుల అదృష్టమని పేర్కొన్నారు. స్కూల్స్, పార్కుల అభివృద్ధి, కాలువల పూడికతీత పనులకు మంత్రి పెద్దపీట వేశారన్నారు. కార్యకర్తల సంక్షేమమే పరమావధిగా ముందుకు సాగుతున్న గొప్ప వ్యక్తి మంత్రి నారాయణ అని, ఒక విజన్‌తో ప్రణాళికబద్ధంగా నగరాభివృద్ధికి కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ నందన్, డివిజన్ అధ్యక్షుడు గొట్టేటి నాగేంద్ర, ప్రధాన కార్యదర్శి నారాయణ, ఉపాధ్యక్షుడు రాంబాబు, కొక్కస్టర్ అవుల శ్రీనివాసులు, 227 బూత్ ఇంచార్జ్ ఏకుల నాగార్జున, గోతం బాలకృష్ణ, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీ కాలనీలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్ మోపూర్ గ్రామం లోని ఎస్టీ కాలనీ నందు గ్రామ రెవెన్యూ అధికారి శ్రీహరి జోరు వానలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేశారు. అదేవిధంగా దిత్వా తుఫాను ప్రభావం ఉన్నందువలన ఎస్టీ కాలనీ వాసులు ఇంటి వద్దనే ఉండాలని, చాపల వేటకు, చెరువులకు కాలువలకు వెళ్ళవద్దని తగు సూచనలు ఇవ్వడం జరిగింది. అదేవిధంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు సురక్షితమైన భవనాల్లోనే ఉండాలని తెలియజేశారు. అలాగే ఈ సైక్లోన్ ప్రభావం తగ్గేంత వరకు ఎవరో కూడా బయటకు రావద్దని కాలనీ వాసులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ అధికారులు, ఎస్టీ కాలనీ వాసులు పాల్గొన్నారు.

## వీఎస్‌యూలో ప్రపంచ ఎయిడ్స్ డే అవగాహన



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** ప్రపంచ ఎయిడ్స్ దేను పురస్కరించుకొని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీతకు విద్యార్థులు రెడ్ రిబ్బన్ బ్యాడ్జ్‌ను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ సునీత, ఎయిడ్స్‌పై సమాజంలో ఉన్న అపోహలను తొలగించేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సరైన అవగాహన, బాధ్యతాయుత ప్రవర్తనతోనే ఎయిడ్స్ నివారణ సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్ విజయ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయ శంకర్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ నాగభూషణరావు, డాక్టర్ సుచరిత, అధ్యాపకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## వీపీఆర్ నేత్ర శిబిరం పట్ల ప్రజల్లో విశేష స్పందన

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వీపీఆర్ నేత్ర బస్సు శిబిరం పట్ల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి, మాజీ జడ్పీ చైర్మన్ పొన్నెబోయిన చెంచల బాబు యాదవ్ పేర్కొన్నారు. గండిపాలెం గ్రామంలో సోమవారం జరిగిన వీపీఆర్ నేతల బస్సు శిబిరం కార్యక్రమంలో టీడీపీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. వరికుంటపాడు మండలంలో నిర్వహించిన విపిఆర్ నేత్ర కార్యక్రమంలో 5700 మందిని పరీక్షించగా అందులో 3500 మందికి కంటి అద్దాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఉదయగిరి మండలంలోని పంచాయతీల్లో జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బయన్న, వీపీఆర్ ఫౌండేషన్ ఆర్గనైజర్ శంకర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## వామపక్షాలు నిర్వహించే బందుకు ఆర్పీఐ మద్దతు

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం కల్లూరు పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీలో గంజాయి ముఠా చేతిలో ప్రజానాట్య మండలి నాయకులు పెంచలయ్య హత్యకు నిరసనగా డిసెంబర్ 2 వామపక్ష నేతలు జిల్లా బందుకు పిలుపునిచ్చిన నేపథ్యంలో రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా నెల్లూరు జిల్లా అధ్యక్షులు ఎస్కే మాబు సోమవారం తమ పూర్తి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి మత్తు పదార్థాలకు దళితులు, ముస్లింలు, ఆదివాసీలు యువత జీవితాలు నాశనం చేసుకుంటున్నారని అలా వారి జీవితాలు నాశనం కాకూడదనే ఉద్దేశంతో కే.పెంచలయ్య అనే యువకుడు తమ ప్రాంతాన్ని గంజాయి రహితంగా ఉండాలని వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడనే కోపంతో స్థానిక గంజాయి బ్యాచ్ పెంచలయ్యను అతి దారుణంగా హత్య చేయడాన్ని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా గంజాయి సరఫరా చేసే వ్యక్తులు ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నారు ఆ పార్టీ ప్రజా ప్రతినిధులను అరెస్ట్ చేయాలని ఆర్‌పిఐ తరఫున మాబు డిమాండ్ చేశారు. అంతేకాకుండా నేడు జరగబోయే జిల్లా బందుకు ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి తమ మద్దతు తెలియజేయాలని ఆయన కోరారు.

## నేడు బంద్‌ను జయప్రదం చేయండి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** సీపీఎం నాయకుడు పెంచలయ్య మృతికి నిరసనగా మంగళవారం జరిగే బంద్‌ను జయప్రదం చేయాలనీ సీపీఎం కార్యదర్శి కోడె రమణయ్య పేర్కొన్నారు. సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో గంజాయి ముఠాతో హత్య కు గురైన పెంచలయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాకు వెంకటయ్య, నాయబ్, నాగేశ్వరరావు, ఫార్దీన్ భాషా, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# పేదవర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పెద్దఎత్తున పెన్షన్ల పంపిణీ

● రంచన్‌గా 1వతేదీనాడే పింఛన్ ● పండుగలాగా పెన్షన్ల పంపిణీ ● వేలకోట్ల పెన్షన్‌లు ● పెద్దఎత్తున అభివృద్ధి పనులు ● మంత్రి ఆనం



**సంగం/ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పేదవర్గాల సంక్షేమం, అభ్యున్నతి లక్ష్యంగా రాష్ట్రంలో పెద్దఎత్తున పెన్షన్లు పంపిణీ చేస్తున్నామని, వేలకోట్ల రూపాయల పెన్షన్ నగదును ప్రతినెలా 1వతేదీనాడు పండుగవాతావరణంలో పంపిణీ చేస్తున్నామని, ప్రళయం వచ్చినా 1వతేదీనాడే పెన్షన్లు అందజేస్తున్నామని, 1వతేదీ సెలవు అయితే ముందురోజే పెన్షన్లు అందజేస్తున్నామని, ఆత్మకూరు నియోజకవర్గంలో పెద్దఎత్తున అభివృద్ధికార్యక్రమాలకు నిధులు మంజూరయ్యాయని రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి వెల్లడించారు. సోమవారం జోరువానసైతం లెక్కచేయకుండా ఆయన ఆత్మకూరు నియోజకవర్గంలోని సంగం మండలం గాంధీజన సంఘంలో పర్యటించి ఎన్టీయార్‌భరోసా పెన్షన్లను ఆయన ఇంటింటికెళ్ళి పంపిణీ చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి పెన్షన్ల పంపిణీ చేశారు. మంత్రి అందరికి పెన్షన్లు అందజేస్తూ వారి యోగక్షేమాలు, ప్రతినెలా 1వతేదీన ఇళ్ళవద్దకే వచ్చి పెన్షన్లు ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. పేదల పెన్షన్లకై కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్న ఏకైక ప్రభుత్వం చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వమని ఆయన ఈసందర్భంగా పేర్కొన్నారు. తుఫాన్ వచ్చినా, ప్రళయం వచ్చినా 1వతేదీనాడే ఇళ్లవద్దనే పెన్షన్లు అందజేస్తున్నా మని ఆయన పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు సంకల్పంతోనే ఈవిధంగా అందజేస్తున్నామని తెలిపారు. పేదలకు పండుగ వాతావరణంలో ఈ పెన్షన్ల పంపిణీ కార్యక్రమం వాడవాడలా, గ్రామ గ్రామాన ముమ్మరంగా 1వతేదీ జరుగుతుందని ఆయన తెలిపారు. నెల్లూరు జిల్లాలో 3,06,299మందికి 133.32కోట్ల రూపాయలు పెన్షన్ ఇస్తున్నామని, నియోజకవర్గంలో 36937మందికి వివిదరకాల పెన్షన్లకు 16.18 కోట్ల రూపాయలు ఖర్చుచేస్తున్నామని వెల్లడించారు. 4వేల నుండి15వేల రూపాయలవరకు ఈపెన్షన్లు అందజేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

### ఆత్మకూరులో పెద్దఎత్తున అభివృద్ధికి నిధులు

ఆత్మకూరు నియోజకవర్గంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. గాంధీ జనసంఘంలో రాష్ట్రీయగ్రామస్వరాజ్ పథకం ద్వారా గ్రామపంచాయతీ భవననిర్మాణానికి 32లక్షల రూపాయలు కేంద్రప్రభుత్వం మంజూరు చేసిందని, ఆయన పేర్కొంటూ ఆ భవననిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. మరో రెండు గ్రామాలకు కూడా పంచాయతీ భవనాలకు నిధులు మంజూరయ్యాయని ఆయన వివరించారు. త్వరలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. తమ ప్రభుత్వ హయాంలో గ్రామీణప్రాంత రహదారుల రూపురేఖలు మారిపోతున్నాయని, ఆత్మకూరు నియోజకవర్గంలో 15కోట్ల రూపాయలతో సిమెంటు రోడ్లు నిర్మించేలా నిధులు మంజూరు చేశామని ఆయన వెల్లడించారు. కొన్ని పూర్తయ్యాయని, మరికొన్ని ప్రారంభం కానున్నాయన్నారు. గాంధీజనసంఘంలో రోడ్ల నిర్మాణాలకు 15లక్షల రూపాయలు మంజూరు చేశామన్నారు. అలాగే మరో 7గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందిలేకుండేలా 27కోట్ల రూపాయలతో రహదారి నిర్మాణపనులకు ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మంజూరు చేశారని, త్వరలో ఆదేశాలందనున్నాయని మంత్రి తెలిపారు. సంగం మండలం వీర్లగుడిపాడుగ్రామానికి రాకపోకలు సాగించేందుకు వాగుపై వంతెన నిర్మాణానికి 25కోట్ల రూపాయలు మంజూరయ్యాయని, ఆగ్రామాన్ని జాతీయరహదారితో అనుసంధానం చేస్తామని, రెండు విద్యుత్‌సబ్‌స్టేషన్లు కూడా మంజూరయ్యాయని మంత్రి వివరించారు. నియోజకవర్గంలో 77చిన్న ఆలయాలకు మరమ్మత్తులకోసం 5లక్షలవంతున 3.85లక్షల రూపాయల నిధులు మంజూరుచేశామని, ఒకవైపు సంక్షేమం, మరో వైపు అభివృద్ధిని పరుగులుపెట్టిస్తూ స్వర్ణాంధ్రసాధనే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని వెల్లడించారు. ఈకార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టుడైరెక్టర్ నాగరాజకుమారి, ఆత్మకూరు ఆర్డీవో భూమిరెడ్డి పావని, తెలుగుదేశం నాయకులు రాష్ట్ర ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాక్‌స్ట్రక్చర్ అండ్‌వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అబ్బూరు రమేష్‌నాయుడు, పిఏసిఎస్ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీనివాసయాదవ్, టిడిపి నాయకుడు బాణా శ్రీనివాసులురెడ్డి, పడమటిపాళెం సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో పండుగలాగా ఫించన్ల పంపిణీ

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో, మండలంలోని గ్రామాల్లో సోమవారం సచివాలయ సిబ్బంది, తెలుగుదేశం ప్రజాప్రతినిధులు, నాయకులు, వివిద స్థాయిల్లో ఉన్న టిడిపి కార్యకర్తలు ఊరూవాడా ముమ్మరంగా జోరువర్షం సైతం లెక్కచేయకుండా ముమ్మరంగా పర్యటించి పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించగా ఎల్లెడలా పండుగవాతావరణం నెలకొనగా పెన్షనర్ల సంతోషానికి అవుధుల్లేకుండా కన్పించింది. ప్రతి నెలమొదటి రోజునే వృద్ధులు, వికలాంగులు, కళాకారులు, వితంతువులు, దీర్ఘకాల వ్యాధిగ్రస్థులు తదితరులందరికీ వారి ఇళ్ళవద్దకే సచివాలయ సిబ్బంది వెళ్ళి పెన్షన్లు పంపిణీ చేస్తుండడం, 1వతేదీ సెలవుదినమైతే ముందురోజే పంపిణీ చేస్తుండడం తెల్సిందే. సోమవారం ప్రాత:కాలం నుండే వారంతా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. సచివాలయ సిబ్బందితోపాటు వారు ఇంటింటికెళ్ళి పెన్షన్లు పంపిణీ చేశారు. పట్టణంలో జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు పెన్షన్లు పంపిణీ చేయగా మండలంలోని వాసిలిలో మండల తెలుగుదేశం అధ్యక్షుడు సుంకర పెంచలచౌదరి పెన్షన్లు పంపిణీ చేశారు. నువ్వురుపాడులో తెలుగుదేశం యూనిట్‌ఇన్‌చార్జ్ కొండ్రెడ్డి రమణారెడ్డి, టిడిపి కార్యదర్శి షేక్ ఖాజావలి, మస్తాన్‌వలి తదితరులు పెన్షన్లు పంపిణీ చేశారు. దేపూరులో టిడిపి నాయకుడు తూమాటి తిరుపతినాయుడు పెన్షన్లు పంపిణీ చేయగా ఆత్మకూరులోని 20వవార్డులో జోరువానలోకౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పెన్షన్లు పంపిణీ చేయగా టిడిపి నాయకులు నాగులూరు చిన్నబ్బయ్య, గుర్నాథం శ్రీనయ్య తదితరులు పాల్గొన్నారు. 4వవార్డులో తెలుగుదేశం నాయకులు దాసరి మధుసూధనరావు, దాసరి బాలకృష్ణ, కాపా వెంకటసుబ్బయ్య తదితరులు పెన్షన్లు పంపిణీ చేశారు. 2వవార్డులో కౌన్సిలర్ దగ్గుమాటి శివకోటారెడ్డి, 3వవార్డులో కౌన్సిలర్ గౌస్‌బాషా, 14వవార్డులో కౌన్సిలర్ పొడమేకల పెంచలయ్యయాదవ్, ఆరవేడు జంగాలపల్లిలో తెలుగుదేశం క్లస్టర్ ఇన్‌చార్జ్ తలచీరుబాబు నాయుడులు పెన్షన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయానుసారం, రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలతో తామంతా పెన్షనర్ల ఇళ్లవద్ద పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటున్నామని పేర్కొన్నారు. పట్టణంలోని వాడవాడలా పెన్షన్ల పంపిణీలో మున్సిపల్ కమీషనర్ సి.గంగాప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, తెలుగుమహిళ రాష్ట్ర కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, వైస్‌చైర్మెన్ సర్దార్, టిడిపి నాయకులు కొప్పోలు చిన్నపురెడ్డి, తదితరులు కార్యక్రమంలో పాల్గొని పెన్షన్లు పంపిణీ చేశారు. ఆత్మకూరు మండలంలోని అన్నిగ్రామాల్లో, మున్సిపల్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో తెలుగుదేశం ప్రజాప్రతినిధులు, నాయకులు పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## క్రమంతప్పకుండా పింఛన్ పంపిణీ : కేతా



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ప్రతి నెలమొదటి రోజునే వృద్ధులు, వికలాంగులు, కళాకారులు, వితంతువులు, దీర్ఘకాల వ్యాధిగ్రస్థులు తదితరులందరికీ వారి ఇళ్ళవద్దకే సచివాలయ సిబ్బంది వెళ్ళి పెన్షన్లు రంచన్‌గా పంపిణీ చేస్తుందని, తమ కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి, పెన్షనర్లపట్ల ఉన్న అభిమానం, ఆదరణకు నిలువెత్తు సాక్ష్యమని, 1వతేదీ సెలవుదినమైతే ముందురోజే పంపిణీ చేస్తున్నామని ఆత్మకూరు నియోజకవర్గ తెలుగుదేశం సీనియర్‌నాయకుడు, చెర్లోయడవల్లి మాజీ సర్పంచ్, మండల సర్పంచ్‌ల సంఘ జిల్లా మాజీ అధ్యక్షుడు కేతా విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ప్రాత:కాలంనుండే చెర్లోయడవల్లిలో జోరువర్షం సైతం లెక్కచేయకుండా ఆయన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. సచివాలయ సిబ్బందితోపాటు ఆయన ఇంటింటికెళ్ళి పెన్షన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో 200రూపాయల పెన్షన్‌ను 2వేలరూపాయలకు పెంచారని, ఈదపా అధికారం చేపట్టిన చంద్రబాబునాయుడు పదవిచేపట్టగానే నాలుగువేలకు పెంచడంతోపాటు మూడునెలల అరియర్స్‌ను కూడా కలిపి ఇళ్ళవద్దనే పంపిణీ చేయించారని పేర్కొన్నారు. నెల మొదటి రోజు సెలవుదినమైతే ముందురోజే పెన్షన్ పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు. అన్నివర్గాల సంక్షేమం, అన్నిప్రాంతాల అభివృద్ధితోపాటు అందరికీ ప్రతినెలా 1వతేదీనాడే పెన్షన్‌లను పంపిణీ చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి నిర్ణయానుసారం, రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలతో తామంతా పెన్షనర్ల ఇళ్లవద్ద పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటున్నామని తోడేటి పేర్కొన్నారు. కాగా ఆత్మకూరు మండలంలోని అన్నిగ్రామాల్లో తెలుగుదేశం ప్రజాప్రతినిధులు, నాయకులు పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## లోతట్టుప్రాంతాల్లో పర్యటించిన ఆర్డీఓ పావని



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** దిత్వా తుఫాన్ ప్రభావంతో భారీగా వర్షాలు కురుస్తుండడం, సోమశిల జలాశయం నుండి అధికంగా నీటిని విడుదల చేస్తుండడం, వాగులు,వంకలు పొంగిప్రవహిస్తుండడం నేపథ్యంలో ఆత్మకూరు ఆర్డీవో భూమిరెడ్డి పావని సోమవారం డివిజన్‌లోని వివిద మండలాల్లో లోతట్టుప్రాంతాలను పరిశీలించారు. నదీపరీవాహక ప్రాంతాలు, లోతట్టుప్రాంతాలను ఆమె పరిశీలించారు. వివిద కాలనీల్లో నీరు ప్రవేశించే అవకాశాలున్నందున సురక్షితప్రాంతాలకు తరలించేందుకు సిద్దంగా ఉండాలని ఆమె సూచించారు. దిత్వా తుఫాన్ ప్రభావంతో గత రెండు రోజులుగా భారీగా వర్షాలు కురుస్తుండడం తోపాటు సోమశిల జలాశయం నుండి నీటిని అధికంగా విడుదల చేస్తుండడంతో ఆమె హెచ్చరికల ముందురోజే కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేయడంతోపాటు అన్ని మండల తహశిల్దారు కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయించి అందరు తహశిల్దార్లు, అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేసిన విషయం విధితమే. ఆమె ఈతుఫాన్ ప్రభావంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండేలా, ఎలాంటి ఆస్థినష్టం, ప్రాణనష్టం లేకుండేలా ముందస్తు జాగ్రత్తల చర్యలు చేపట్టారు. ఎప్పటికప్పుడు అధికారులను సమన్వయం చేస్తూ జిల్లా కలెక్టర్, మంత్రి ఆదేశాలను, సూచనలను అనుసరిస్తూ అప్రమత్తంగా ఉన్నారు.

## చెరువు అలుగును పరిశీలించిన తుమ్మల



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** దిత్వా తుఫాన్ సందర్భంగా సోమవారం ఆత్మకూరు చెరువువద్ద అలుగును పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి పరిశీలించారు. తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తుండడం, వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండడంతో చెరువులో నిటిపరిస్థితి, అలుగు పారడం తదితరాలను చంద్రారెడ్డి పరిశీలించారు. లోతుట్టుప్రాంతాలవారు అమ్రత్తంగా ఉండాలని ఆయన సూచించారు. రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి సూచనలతో తాము చెరువును పరిశీలించామని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, మున్సిపల్ వైస్‌చైర్మెన్ షేక్ సర్దార్‌లు పాల్గొన్నారు. వివిద లోతట్టు ప్రాంతాలను కూడా వారు పరిశీలించారు.

# ఫించన్లు పెంచిన ఘనత సీఎం చంద్రబాబుదే : గిరిధర్ రెడ్డి

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 26వ డివిజన్ డ్రైవర్స్ కాలనీ బిట్-2 నందు సోమవారం ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోటం రెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ.. చెప్పినమాటకి కట్టుబడి ఉండే వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు అని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పెన్షన్‌ల నగదు పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడుదేనని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 31వేల మంది పెన్షనర్లకు ఎన్.టి.ఆర్. భరోసా పెన్షన్ కార్యక్రమం ద్వారా 13.55 కోట్ల రూపాయలు పంపిణీ చేశామని టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం రెండూ రెండు కళ్ళలా సాగుతున్నాయని టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సహకారంతో నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కి మీ ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ నగర మేయర్ నందిమండలం భానుశ్రీ, క్లస్టర్ ఇంచార్జ్ మన్నెం పెంచల్ నాయుడు, కో క్లస్టర్ ఇన్‌చార్జ్ ఎల్‌పి



కృష్ణారెడ్డి, 26వ డివిజన్ కార్పొరేటర్ బూడిద సుప్రజ, 26వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు బూడిద పురుషోత్తం యాదవ్, 26వ వార్డు సచివాలయం అడ్మిన్ సయ్యద్. అబ్దుల్ జబ్బార్, టిడిపి నాయకులు వెంకయ్య యాదవ్, మాధవి, గౌస్, జావీద్, రాజేష్, సిహెచ్. కృష్ణారెడ్డి, రమణ, కాలేషా, ఖాదర్ భాష, సీనయ్య, కార్తీక్, సుబ్బరాజు, జుబేర్, చాన్ భాష, చంద్ర, గణపతి, సర్దార్, బాబు, ఏజస్, శ్రీనివాసులు, సర్దార్, శంకర్, రఫీ, రేణు, నస్రు, సుజాత, సరిత తదితరులు పాల్గొన్నారు.

# కొండేరు ఉధృతి





- స్తంభించిన జనజీవనం అస్తవ్యస్తంగా డ్రైనేజీ
- పనులు లేక ఇబ్బందులు పడ్డ దినసరి కూలీలు

**రాపూరు, మేజర్‌న్యూస్ :** ద్విత్వ తుఫాను ప్రభావం నేపథ్యంలో రాపూరు మండలంలో వాగులు, వంకలు, కుంటలు పూర్తి స్థాయిలో నిండి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మల్లమ్మగుంట సమీపంలోని కొండేరు భారీ వర్షాల కారణంగా ఉధృతంగా ప్రవహిస్తుంది. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తుండటంతో మండలంలోని అన్ని చెరువులు జలకళ సంతరించుకున్నాయి. కూలి పనులే ప్రధానంగా జీవనంగా సాగిస్తున్న ఈ ప్రాంత ప్రజలు మూడు రోజులుగా చూస్తున్న దిత్వా తుఫాన్ ప్రభావం వల్ల కూలి పనులు లేకపోవడంతో నానావస్థలు ఎదుర్కొన్నారు. గడచిన మూడు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా వర్షాలతో పాటు ఈదురగాలులు వీస్తుండటంతో వయో వృద్ధులు, చిన్నపిల్లలు, వివిధ వ్యాధుల తో బాధపడే వారు చలిగాలులతో చాలా ఇబ్బందులు పడ్డారు. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రాపూరు పట్టణంలోని అన్ని ప్రధాన వీధిలో జలమయం కావడమే కాకుండా డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిన నేపథ్యంలో మురుగునీరు, చెత్తచెదరాలు మొత్తం ఇళ్లల్లోకి రావడం జనజీవనం నరకయాతం అనుభవించారు. పట్టణంలో ఎక్కడా కూడా డ్రైనేజీ కాలువలలో పూడికలు తీసుకోవడం, డ్రైనేజీ కాలువలు అసలు లేకపోవడం తీవ్ర అంతరాయాన్ని కలిగించింది. ప్రధాన బజారువీధి బురదమయంగా మారింది. మండలంలోని అన్ని సాగునీటి చెరువులలో కొత్తనీరు చేరడంతో చెరువులకు జలకళ సంతరించుకుంది. కొండేరు, కలుజులు, ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

# ఆత్మకూరులో మంత్రి ఆనం పర్యటన నేడే



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలో మంగళవారం రాష్ట్రదేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పర్యటిస్తారని పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి పేర్కొన్నారు. ఉదయం 10గంటలకు సా&థనిక మున్సిపల్ పరిధిలో మౌళికవసతుల కల్పనదిశగా పలుప్రాంతాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులతో కలిసి సందర్శిస్తారని ఆయన తెలిపారు. 11.30గంటలకు స్థానిక ఆర్‌అండ్‌బి అతిధిగృహం వద్ద నియోజకవర్గపరిధిలో డిసెంబర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సిఎంసహాయనిధుల నుండి మంజూరుచేసిన 35.51లక్షల రూపాయల చెక్కులను 28కుటుంబాలవారికి మంత్రి ఆనం పంపిణీ చేస్తారని తుమ్మల పేర్కొన్నారు. అందరు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు ఈకార్యక్రమంలో పాల్గొనాలని చంద్రారెడ్డి కోరారు.





ఎంతటి తుఫాన్ అయినా..

## బ్రతుకు బండి నడవాల్సిందే..

నెల్లూరు జిల్లాలో గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రోజు వారి కూలీలు, చిరు వ్యాపారులు తుఫాన్ ను సైతం లెక్కచేయకుండా వారి బ్రతుకు పోరాటం నెల్లూరు నగరంలో ఇలా కనిపించింది.

- సూర్య స్టాప్ ఫోటోగ్రాఫర్





# పలు ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ నగర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు వరద నీరు రోడ్లపై చేరకుండా పర్యవేక్షిస్తూ అధికారులతో కలిసి ట్రంకు రోడ్డులో సోమవారం పర్యటించారు. స్థానిక గాంధీబొమ్మ, కనకమహల్ సెంటర్, లక్కీ షాపింగ్ మాల్, బృందావనం, సండే మార్కెట్, వెంకటరమణ హోటల్ వెనకవైపు డ్రైను కాలువలలో వరదనీటి ప్రవాహాన్ని పరిశీలించి అధికారులకు వివిధ సూచనలు జారీ చేశారు. వర్షపునీరు రోడ్లపై చేరి వాహనాల రాకపోకలకు అడ్డంకులు ఏర్పడకుండా డ్రైను కాలువలు బ్లాక్ అవుతున్న ప్రాంతాలను గుర్తించి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు.

# సీఎం సహాయ నిధి పేదలకు సంజీవిని లాంటిది

- మంత్రి పొంగూరు నారాయణ వెల్లడి



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్ న్యూస్ :** పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం అని, పేద కుటుంబాలు వైద్యకోసం దరఖాస్తు చేసిన వెంటనే సీఎం నిధులు మంజూరు చేస్తున్నారని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. అందులో భాగంగా 55 మందికి 41,52,181 రూపాయల చెక్కులు అందచేసారు. సీఎంఆర్‌ఎఫ్ మంజూరుకు సహకరించిన మంత్రి నారాయణకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. పేదల ప్రభుత్వం పదికాలాలపాటు ఉండాలని లబ్ధిదారులు ఆకాంక్షించారు. అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడాతూ.. సీఎం సహాయనిధి పేదలపాలిట సంజీవనిగా మరిందని, పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ కొండత అండగా భరోసా కల్పించిందని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు సీఎం సహాయనిధి ఎంతో సహాయపడుతుందని తెలిపారు. దరఖాస్తు చేసుకొన్న వారందరికీ సహాయనిధి మంజూరు చేస్తున్నారన్నారు.సిటీ నియోజకవర్గంలో ఏడాదిలో 263మందికి 2,79,70,395 రూపాయల చెక్కులు అందచేసామని, పేదల సంక్షేమానికి సీఎం చంద్రబాబు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని మంత్రి స్పష్టం చేశారు. మాటమీద నిలబడే ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని, ఎన్నికల్లో కూటమి ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామన్నారు. గత ప్రభుత్వం చేసిన అవకతవకలను సరిచేసి పాలనను గాడిలో పెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జెడ్పిటిసి విజేత రెడ్డి, నగర అధ్యక్షుడు మామిడాల మధు, టిడిపి ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బీద రవిచంద్రని కలిసిన దేశం నేతలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎమ్మెల్సీ బీద రవిచంద్రను సోమవారం వింజమూరు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గూడా నర్సారెడ్డి మండల ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీనివాసులు యాదవ్ మంగళగిరిలో టిడిపి కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.తెలుగుదేశం పార్టీ నూతనమండల అధ్యక్ష కార్యదర్శులకు మంగళగిరిలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులకు గూడా నర్సారెడ్డి చల్లా. శ్రీనివాసులు యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు విషయాలు బీద రవిచంద్ర దృష్టికి నేతలు తీసుకొని వెళ్లారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్తున్నామన్నారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాలు సూచనలతో పార్టీ బలోపేతం కొరకు నిరంతరం పనిచేస్తున్నామన్నారు ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. త్వరలో జరగబోయే స్థానిక సమస్యల ఎన్నికలలో నియోజవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు విజయ దంక మోగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు గూడా నవీన్ రెడ్డి దేవరాల ప్రసాద్ పల్లాపు అంకయ్య చిన్న అంకయ్య తదితరులు పాల్గొన్నారు.